క్లుప్తంగా

జనసేన, టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



తెనాలి: పట్టణ ప్యాడిసన్ పేటకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చాగలమర్రి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో అదే ప్రాంతానికి చెందిన జనసేన, టీడీపీకి చెందిన 30 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. అయితానగర్‌లో ఆదివారం సాయంత్రం పట్టణ ఒకటో వార్డు కౌన్సిలరు గెద్దేటి సురేంద్ర, 15వ వార్డు కౌన్సిలరు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు సమక్షంలో వీరంతా పార్టీలో చేరారు. కౌన్సిలర్లు ఇద్దరూ వారికి పార్టీ కండువాలను కప్పి స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి అన్నాబత్తుని శివ కుమార్ విజయానికి కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో తాతపూడి విజయ్, మోరంపూడి శ్యామ్‌బాబు, కంచర్ల భరత్, తంగిరాల బెన్‌హర్, తాతపూడి నిరీక్షణ్, కారుమూరి సురేష్, పల్లె కోటేశ్వరరావు, బలసాని వంశీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ



తెనాలి: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజి రోడ్డులోని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు సాతులూరి రామ్‌ప్రసాద్, క్లబ్ వ్యవస్థాపకుడు కాకరపర్తి సుబ్రహ్మణ్యం, క్లబ్ సభ్యులు డాక్టర్ కొత్తపల్లి రాజకుమార్, అయినాల మల్లేశ్వర రావు, నంబూరు శ్రీకుమార్, మున్సిపల్ కార్మికులు బి.సంధ్యారాణి, ఆర్.కనకలక్ష్మి, ఎం.రోజారమణి, ఫ్రాన్సి, కంచర్ల భోజరాజు (ఏలియా) పాల్గొన్నారు. క్లబ్ సభ్యులు డాక్టర్ కొత్తపల్లి రాజకుమార్, సుమతి దంపతుల వివాహం సందర్భంగా ఈ వితరణ చేశారు.

జగద్గురువు ఆదిశంకరాచార్యులు



భట్టిప్రోలు: వేదాలు, శాస్త్రాలకు వక్ర భాష్యం చెబుతూ హిందూ ధర్మం శాఖలుగా విడిపోతున్న నేపథ్యంలో హిందూ ధర్మ ఐక్యత కోసం అద్వైతాన్ని ప్రబోధించిన మహానుభావుడు ఆదిశంకరాచార్యులని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం ఐలవరంలోని రామ మందిరంలో జగత్ గురువులు ఆదిశంకరాచార్యులు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హేమ శంకరరావు భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. శంకరాచార్యులు కాలినడకన దేశమంతటా తిరిగి అష్టాదశ పీఠాలను స్థాపించి హిందూ ధర్మ ఐక్యత కోసం కృషి చేసి 32 ఏళ్లకే పరమపదించి మనలో స్ఫూర్తి నింపిన మహానుభావుడని కొనియాడారు. కొంత మంది మాత్రమే వేదాలను చదవాలని సమాజంలో ఉన్నప్పుడు రామానుజాచార్యులు గురువు ఉపదేశించిన నారాయణ మంత్రాన్ని పామరులందరికీ అందజేసి విశిష్టాద్వైతాన్ని ప్రబోధించి దేశంలో పీఠాలు స్థాపించిన సమతా మూర్తి అని పేర్కొన్నారు.

ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్ మృతి

భట్టిప్రోలు: ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన భట్టిప్రోలు మండలం పెదలంక మధ్యగూడెంలో చోటు చేసుకుంది. మధ్యగూడెంకు చెందిన దున్నా శ్రీధర్(35) ఆదివారం ఉదయం ఇసుక లోడుతో పెదలంక నుంచి వెల్లటూరు వెళుతున్నాడు. చింతమోటు స్మశాన వాటిక దగ్గరకు వచ్చే సరికి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న శ్రీధర్ ట్రాక్టర్ కింద పడి మృత్యువాతకు గురయ్యాడు. సమాచారం మేరకు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రొక్లయినర్‌తో ట్రాక్టర్‌ను బయటకు తీయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలి

నెహ్రూ నగర్: నేడు జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని శాలివాహనుల అంతా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రి చేసుకోవడానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఏపీ శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాల ద్వారా 6.25 లక్షల మంది లబ్ధి పొందరాని గుర్తు చేశారు. కుమ్మరులకు కోటప్పకొండ వద్ద అన్నదాన సత్రం, ఆక్రమణకు గురైన కుమ్మరి కుంటలు తిరిగి వారికే కేటాయించారన్నారు.

నేడు పోలింగ్.. అంతా సిద్ధం

- ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల పంపిణీ
- నియోజకవర్గంలో మొత్తం 273 పోలింగ్ కేంద్రాలు
- పోలింగ్ కేంద్రాల వద్ద సెక్షన్ 144 నిషేధాజ్ఞలు
- సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల వద్ద మైక్రో అబ్జర్వర్లు
- రిటర్నింగ్ అధికారి ప్రఖర్‌జైన్ పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తి



జేఎంజే కళాశాలలో పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో ప్రఖర్‌జైన్

తెనాలి: సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. ఈవీఎంలు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నాయి. పోలింగ్ అధికారుల కేటాయింపుతో సహా సంబంధిత ఏర్పాట్లు అన్నీ సిద్ధమయ్యాయి. నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయించే ఓటరు తీర్పునివ్వటమే తరువాయి. స్థానిక జేఎంజే మహిళా కళాశాల ఆవరణలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఆదివారం పోలింగ్ అధికారులకు ఈవీఎం మిషన్లు, వీవీ ప్యాట్‌లను, ఇతర ఎన్నికల సామగ్రిని కేటాయించారు. అందరిని ప్రత్యేక వాహనాల్లో సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలించారు. తెనాలి సబ్‌కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రఖర్‌జైన్, సహాయ రిటరింగ్ అధికారులైన మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మండల తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని సజావుగా పూర్తిచేశారు.



ఈవీఎం, వీవీ ప్యాట్‌లతో పోలింగ్ కేంద్రాలకు అధికారులు



సిద్ధం చేసిన పోలింగ్ కేంద్రం

మహిళా ఓటర్లు అధికం..

తెనాలి మున్సిపాలిటీ, రూరల్ మండలం, కొల్లిపర మండలం పరిధిగా గల 91-తెనాలి నియోజకవర్గంలో మొత్తం 2,64,436 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో మహిళా ఓటర్లు 1,36,795 మంది కాగా, పురుష ఓటర్లు 1,27,603 ఉన్నారు. పురుషుల కన్నా మహిళా ఓటర్లు 9,192 మంది అధికంగా ఉన్నారు. ట్రాన్స్‌జెండర్లు 38 మంది.



ఈవీఎం, వీవీ ప్యాట్

పట్టణంలో ఓటర్లు ఇలా..

తెనాలి పట్టణంలో మొత్తం ఓటర్లు 1,55,063 మంది కాగా, పురుష ఓటర్లు 74,584, మహిళా ఓటర్లు 80,446 ఉన్నారు. తెనాలి రూరల్ మండలంలో ఓటర్లు 64,666 కాగా, పురుష ఓటర్లు 31,301, మహిళా ఓటర్లు 33,361 మంది ఉన్నారు. కొల్లిపర మండలంలో ఓటర్లు 44,707 కాగా, పురుష ఓటర్లు 21,718, మహిళా ఓటర్లు 22,988 మంది ఉన్నారు. కొత్తగా 4,986 మంది యువజనులు ఓటు హక్కు పొందారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం 7 గంటల్నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగనుంది. నియోజకవర్గంలో మొత్తం 273 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో కేంద్రానికి పోలింగ్ అధికారి, సహాయ పోలింగ్ అధికారితో సహా ఆరుగురు సిబ్బందిని కేటాయించారు. ఇప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తిచేశారు. మహిళలు, దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. మంచినీటి సౌకర్యాన్ని కల్పించారు. కామన్ పోలింగ్ బూత్‌తో సహా యువతకు, దివ్యాంగులకు, మహిళలకు ఒకటి చొప్పున మొత్తం నాలుగు మోడల్ పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా పోలీసు బందోబస్తు ఉంటుందని ప్రఖర్‌జైన్ వెల్లడించారు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల వద్ద మైక్రో అబ్జర్వర్లు పరిస్థితులను గమనిస్తుంటారని తెలిపారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను ఆచార్య నాగార్జున యూనివర్శిటీలోని రిసెప్షన్ కేంద్రానికి బందోబస్తుతో తరలింపు ఉంటుందని వివరించారు.

ఎన్నికలకు పోలీసు శాఖ సంసిద్ధం

- 284 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశాం
- డీఎస్పీ ఎం. రమేష్



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ రమేష్, పక్కన సీఐలు

తెనాలిరూరల్: ఎన్నికల నిర్వహణలో కీలకమైన భద్రతా, బందోబస్తు చర్యలు చేపట్టేందుకు పోలీసుల శాఖ సంసిద్ధంగా ఉందని డీఎస్పీ ఎం.రమేష్ తెలిపారు. తెనాలి సబ్ డివిజన్‌లో తెనాలి, పొన్నూరు నియోజకవర్గాలు ఉన్న నేపథ్యంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసులు సిబ్బందికి ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏ బృందం ఎక్కడ విధుల్లో ఉండాలి, విధి నిర్వహణలో ఏ విధమైన చర్యలు తీసుకోవాలన్న అంశంపై సివిల్ పోలీసులతో పాటు కేంద్ర బలగాలకూ దిశా నిర్దేశం చేశారు. అనంతరం డీఎస్పీ విలేకర్లతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మొబైల్ పార్టీ, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ సంచరిస్తూ ఉంటాయని, ఎక్కడికక్కడ ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని విధాలుగా సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో ఇప్పటికే 284 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేశామని, 2019 ఎన్నికల సందర్భంలో కేసుల్లో ఉన్న వారినీ బైండోవర్ చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల వరకు ఏ వాహనాన్ని అనుమతించేది లేదని స్పష్టం చేశారు. కార్లు 200 మీటర్ల దూరంలోనే ఆపేస్తామని చెప్పారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్‌లను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. స్థానికంగా ఓటు హక్కులేని వారిని గుర్తిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో 40 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించామని, పోలీసులు వీడియో రికార్డింగ్‌తో విధులు నిర్వహిస్తుంటారని చెప్పారు. ఎక్కడ చిన్న ఘటన జరిగినా వెంటనే సంబంధిత పోలింగ్ కేంద్రానికి చేరుకునేలా స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ కోసం 25 రూట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ కోరారు. ఆయన వెంట సీఐలు, ఎస్ఐలు సిబ్బంది ఉన్నారు.

తాటికాయలు కోసే విషయంలో వివాదం

నలుగురికి గాయాలు



కంతేరు శివారులో జరిగిన ఘర్షణలో గాయాలపాలైన కొప్పురావూరు యువకుడు

పెదకాకాని: తాటికాయలు కోసే విషయంలో ఇరుగ్రామాల మధ్య చోటు చేసుకున్న వివాదం ఘర్షణకు దారి తీసింది. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామానికి చెందిన మేకల అశోక్ గత కొంతకాలంగా తాటి ముంజలు విక్రయిస్తున్నాడు. తాటి కాయలు కోసేందుకు ఆదివారం మరో ముగ్గురితో కలసి కొప్పురావూరు గ్రామ శివారు ప్రాంతంలోని కంతేరు వెళ్లగా కొందరు టీడీపీకి చెందిన వారు అక్కడికి చేరుకున్నారు. ఇరువురి మధ్య వివాదం చోటు చేసుకుంది. వెంటనే కంతేరు గ్రామంలోని స్నేహితులను మరికొంత మందిని ఫోన్ చేసి పిలిపించారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య చోటు చేసుకున్న వివాదం ఘర్షణకు దారి తీసింది, కొప్పురావూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువకులపై రాళ్ళు, సీసా పెంకులతో దాడి చేశారు. దాడి చేసిన వారిలో కంతేరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు, యువత ఉన్నట్లు బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. గాయపడిన వారిలో మేకల అశోక్, విజయ్, కొమ్ము రమేష్, బుల్లా దిలీప్, బలిజేపల్లి ప్రశాంత్ కుమార్ ఉన్నారు. సంఘటనా స్థలానికి తాడికొండ పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎన్నికల సమరానికి సర్వం సిద్ధం

- నేడు సార్వత్రిక ఎన్నికల నిర్వహణ
- పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతుల ఏర్పాటు
- సమస్యాత్మక ప్రాంతాలలో పటిష్ట బందోబస్తు
- నేటి ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభం



మంగళగిరిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి



మంగళగిరిలో సిబ్బందికి ఈవీఎంలు అందజేస్తున్న జేసీ రాజకుమారి

మంగళగిరి: సోమవారం నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు నియోజకవర్గంలో 300 పోలింగ్ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జేసీ రాజకుమారి ఘనియా తెలిపారు. ఆదివారం నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట నిర్మల ఫార్మసీ కళాశాల ఆవరణలో 300 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను ఎన్నికల అధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం జరగనున్న ఎన్నికలకు సంబంధించి అన్ని పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఓటర్లు ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశముందన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు. నార్త్ జోన్ డీఎస్పీ రవికాంత్ మాట్లాడుతూ నియోజకవర్గంలో 450 పోలీసులతో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే గుర్తించి అక్కడ మరింత బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

తాడికొండ: ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమైంది. ఇప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. అత్యంత సమస్యాత్మక కేంద్రాల వద్ద పోలీసు విభాగం ఆధ్వర్యంలో వెబ్ కెమెరాలతో నిఘాను కొనసాగిస్తున్నారు. తాడికొండ నియోజకవర్గంలో మొత్తం 244 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఇందులో 62 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కెమెరాల ద్వారా ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండగా 68– 70 శాతం పోలింగ్ జరుగుతుందనే అంచనా వేశారు. ఇటీవల జరిగిన హోం ఓటింగ్‌లో 258 మంది 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు, 180 మంది వికలాంగులు తమ ఓటు హక్కును ఇంటి వద్దే వినియోగించుకోగా ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులు 1,654 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేశారు. ఇక మద్యం, నగదు పంపిణీకి పార్టీలు తెరలేపడంతో పోలీసులు తమ నిఘాను పెంచి గస్తీ ముమ్మరం చేశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి

ఫిరంగిపురం: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 18 గ్రామాల్లోని 65 పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని అన్ని పోలింగ్‌బూత్‌లను ఆదివారం ఆమె పరిశీలించి మౌలిక వసతుల ఏర్పాటుపై సమీక్షించారు. బూత్‌లవద్ద షామియానాలు, కుర్చీలు, తాగునీటి సౌకర్యం, టాయిలెట్లు వంటివి ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ బూత్ పరిసర ప్రాంతాలను పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా శుభ్రం చేయించినట్లు తెలిపారు.

పూర్తయిన పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో నేడు జరుగనున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను కార్పొరేషన్ అధికారులు పూర్తి చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలో 41 బూత్‌లలో పురుషులు 21,061మంది, మహిళలు 22,724మంది, ఇతరులు 1తో కలిపి 43,786 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. తాడేపల్లి రూరల్‌లో 48 బూత్‌లలో పురుషులు 26,600 మంది, మహిళలు 27,555 మంది, వెరసి 53,155 మంది ఓటర్లు ఓటును వినియోగించుకోనున్నారు. దుగ్గిరాలలో 58 పోలింగ్ బూత్‌ల పరిధిలో పురుషులు 24,924 మంది, మహిళలు 26,828 మంది, ఇతరులు 4గురు మొత్తం 51,756 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాటు పూర్తి చేశారు. ఉదయం 5 గంటలకే బూత్ ఏజెంట్లకు మాక్ పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. తప్పని సరిగా బూత్ ఏజెంట్లు హాజరు కావాలని ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

అమల్లో 144 సెక్షన్

ప్రత్తిపాడు: పోలింగ్ స్టేషన్లకు వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రత్తిపాడు సీఐ ఎండీ నిషార్ బాషా తెలిపారు. ఈనేపథ్యంలో పోలింగ్ కేంద్రాల ఆవరణలో ముగ్గురు లేదా నలుగురి కన్నా ఎక్కువగా గుమిగూడవద్దని సూచించారు. ఓటర్లను బెదిరించినా, ప్రలోభాలకు గురిచేసినా ఉఠిన చర్యలను తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రశాంత వాతారవణంలో ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

186 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు నియోజకవర్గంలో 186 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గ పరిధిలోని వట్టిచెరుకూరు మండలంలో 31 కేంద్రాల్లో, గుంటూరు రూరల్‌లో 75, ప్రత్తిపాడులో 35, పెదనందిపాడులో 18, కాకుమానులో 27 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి కావాల్సిన ఇంటర్నెట్, సీసీ కెమెరాలు, విద్యుత్ సౌకర్యాలతో పాటు ఇతరత్రా వసతులను సిద్ధం చేసారు. దీంతో పోలింగ్ ప్రక్రియ మొదలైన నుంచి ముగిసే వరకు ఈ వెబ్‌కాస్టింగ్ జరగనుంది.

సీఎం వైఎస్ జగన్ పాలన వైపే ప్రజలు మొగ్గు



తాడికొండ: తాడికొండలో ఎమ్మెల్యే సుచరిత గెలుపు నల్లేరుపై నడకేనని, ఘనమైన మెజారిటీతో నియోజకవర్గంలో విజయం సాధించబోతున్నారని ఏపీ మార్కెటింగ్ కో ఆపరేటివ్ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం తాడికొండలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభంజనం వీస్తుందని, దేశంలోనే సర్వజనులకు ప్రభుత్వ ఫలాలను ఇంటికే అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ వాస్తవాన్ని అనుభవదారులైన 88 శాతం ప్రజలు పూర్తి అవగాహన చేసుకొని జగనన్న పాలన పది కాలాలు కావాలని కోరుకుంటున్నారన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమం, అభివృద్ధిని సమాన స్థాయిలో తీసుకెళ్ళిన నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అని, మారుమూల గ్రామాల్లో సైతం విద్యాలయాలు, వైద్యాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్ వాడీ కేంద్రాలు, ఇంటింటికీ వైద్యం, వీటన్నింటికీ మించి గ్రామ వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికి ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. ఆడపడుచులు, వృద్ధులు, విద్యార్థులు 90 శాతం మా జగనన్న రావాలని ఆరాటపడుతున్నారన్నారు. అనేక పథకాలను ఇంటికి చేర్చే ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నిరుపేదల పొట్టగొట్టేందుకు పూనుకున్న కుటిల కూటమి మూడు పార్టీల నాయకులైన చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి ప్రజలను మోసగిస్తున్నారన్నారు. దాదాపు రూ.2.75 లక్షల కోట్లను ప్రజలకు నగదు రూపంలో ఇచ్చిన ఘనత 77 సంవత్సరాల స్వాతంత్ర్యంలో జగనన్నకే సాధ్యమైందన్నారు. అభివృద్ధి లేదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నారని, గ్రామాల్లో శాశ్వతంగా జరిగినది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. తీర ప్రాంతంలో 4 పోర్టులు, 10 హార్బర్లతో 50 లక్షల మందికి ఉపాధి కల్పించే నిర్మాణాలు జరుగుతుంటే అది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు 50 శాతానికి పైబడి రాజ్యాధికారం ఇచ్చిన చరిత్ర దేశంలోనే ఏపీకి దక్కుతుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోను 99 శాతం అమలు పరచిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని అన్నారు.

బియ్యం, సరుకులు పంపిణీ



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ వృద్ధులు, దివ్యాంగులకు తమ వంతుగా సహాయం అందించాలని శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ కోరారు. నెలా నెలలో భాగంగా ఆదివారం కొత్తపేటలోని సమితి కార్యాలయంలో వంద మంది వయోవృద్ధులు, దివ్యాంగులకు 13 రకాల నిత్యావసర వస్తువులు, బియ్యం కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి కూర్నాల హరి వెంకటసతీష్ మాట్లాడుతూ సమితి తరఫున ఎంతో కాలంగా పేదలకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు పోలేపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, కూరపాటి లీలాకర్, పలకలూరి శివరావు, మామిడి వెంకటశ్రావణ్, టి.మురళీ సాయి, పల్లంపాటి రజనీశ్వర రావు, టీజీ సారథి, మాజేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి



ప్రమాదంలో మరణించిన వృద్ధుడు తిరుపతయ్య



ప్రమాదంలో కారు ముందు భాగంలో ఇరుక్కుపోయిన మోపెడ్

చేబ్రోలు: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో వృద్ధుడు మరణించిన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు శివారులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ తిరుపతయ్య (64) గుంటూరులో నిర్మాణంలో ఉన్న పెట్రోలు బంకుకు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం ముట్లూరు నుంచి తన మోపెడ్‌పై గుంటూరు వస్తుండగా నారాకోడూరు, బుడంపాడు మధ్య ఓ దాబా సెంటర్ ఎదురుగా వెనుక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తిరుపతయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.

కారు ముందుబాగంలో టీవీఎస్ వాహనం ఇరుక్కుపోయింది. ప్రమాద సంఘటనపై చేబ్రోలు ఎస్ఐ పి మహేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఓటు కోసం.. ఓరిమితో

ప్రత్తిపాడు: ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు దూరప్రాంతాల్లో ఉన్నవాళ్లంతా సొంతూళ్లకు చేరుకుంటున్నారు. తాము అభిమానించిన నాయకులను మరోసారి ఎన్నుకోవాలని, మంచి చేసేవారికి పట్టం కట్టాలనే సంకల్పంతో దూరబారాలకు ఓర్చి ఓటున్న చోటికి వచ్చి వాలుతున్నారు. ముఖ్యంగా ఈదఫా ఎన్నికల్లో యువత అమితాసక్తి కనబరుస్తోంది. వందల కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ ఒకరోజు ముందుగానే చేరుకుని సోమవారం జరిగే పోలింగ్ లో తమ వంతు భాగస్వామ్యం కోసం ఆసక్తికనబరుస్తున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, వలస కూలీలు ఇలా ఒకరేంటి పలు వర్గాల ప్రజల సమాహారం పల్లెల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. గ్రామ గ్రామాన ఓట్ల పండగ వాతావరణం సాక్షాత్కరిస్తుంది.

భువనేశ్వర్ నుంచి వచ్చా



నేను భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌లో హౌస్ సర్జన్ గా చేస్తున్నాను. ఈ ఎన్నికల్లో ఓటేయడంకోసం నెలరోజులుగా ఎదురుచూస్తున్నాను. నాలుగు రోజుల పాటు సెలవులు పెట్టి మరీ స్వచ్ఛందంగా ఓటు వేసేందుకు వచ్చాను. ఓటుకున్న విలువను యువత గ్రహించాలి. మంచి చేసినవారిని ఎన్నుకోవాలి.

– డాక్టర్ వేలూరి లక్ష్మీవెన్నెలా రెడ్డి , హౌస్ సర్జన్, ఎయిమ్స్, భువనేశ్వర్

గుల్బర్గా నుంచి



నేను కర్ణాటకలోని గుల్బర్గాలో స్టేట్‌బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాను. నా ఓటు సొంతూరైన ప్రత్తిపాడులో ఉంది. అందుకే గుల్బర్గా నుంచి నావంతు బాధ్యతగా ఓటేసేందుకు వచ్చాను. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకుంటాను.

– పులి అశోక్ (ప్రత్తిపాడు), పులి అశోక్, ఎస్ బీఐ అసిస్టెంట్ మేనేజర్, గుల్బర్గా, కర్ణాటక

విధిగా ఓటేసేందుకు వస్తా



నేను హైదరాబాద్‌లోని ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేస్తున్నా. ఎక్కడున్నా ఓటు వేసేందుకు విధిగా వస్తాను. ఓటు హక్కు వినియోగించుకునేందుకు స్వచ్ఛంధంగా వచ్చాను. ఈసారి ఎన్నికల్లో యువత ముందుకురావాలి. సమర్థవంతమైన పాలకుడిని ఎన్నుకోవాలి. – చోడెం వైష్ణవి, సాఫ్ట్ వేర్ ఉద్యోగి, హైదరాబాద్